




ఆ ఉద్యోగుల రూటే సపరేటు

డీఏవో కార్యాలయంలో ఫెవికాల్ వీరులు

జిల్లా వ్యవసాయ శాఖ (డీఏవో) కార్యాలయంలో కొందరు ఉద్యోగుల రూటే సెపరేటు. పోస్టింగ్ ఒక చోట.. విధులు మాత్రం ఆఫీసులోనే. వైసీపీ హయాంలో, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ వారిదే హవా. ఒకేచోట ఐదేళ్లకుపైగా పని చేస్తున్న ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీ చేయాలనే మార్గదర్శకాలున్నా అవి వారికి వర్తించవు. పోస్టింగ్ ఒకచోట ఉంటే.. ఆన్‌డ్యూటీ (ఓడీ) పేరిట విధులు మరోచోట నిర్వహిస్తారు. ఒకే సీటులో ఏళ్ల తరబడి పాతకుపోయారు. వారికి ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఆ ఫెవికాల్ ఉద్యోగులను తమ రెగ్యులర్ స్థానాలకు పంపుతారా..? రాజకీయ నాయకులు పేర్లు చెప్పి ఇక్కడే కొనసాగిస్తారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

- ఆన్‌డ్యూటీ పేరిట తిష్ట
- పోస్టింగ్ ఓ చోట.. విధులు మాత్రం డీఏవోలోనే..
- వర్తించని ప్రభుత్వ మార్గదర్శకాలు
- వైసీపీ హయాంలోనూ.. ఇప్పుడూ వారిదే హవా
- కీలక విభాగాల్లో పెత్తనం
- ప్రతి పనికో రేటు
- పైసలిస్తే పనులు.. లేదంటే అంతే?

కర్నూలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలు అందించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ (డీఏవో) కార్యాలయ పరిధిలో సాధారణ పరిపాలన, క్వాలిటీ కంట్రోల్, ఎక్స్‌టెన్షన్, అకౌంట్ సెక్షన్లు ఉంటాయి. ప్రతి విభాగంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులుంటాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, రాయితీ విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ వంటి సంక్షేమ పథకాలతో పాటుగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, లైసెన్సులు జారీ, రెన్యూవల్ చేస్తారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో 2,500కు పైగా వివిధ లైసెన్సులు ఉన్నాయి. కొత్తగా లైసెన్సులు జారీ, రెన్యూవల్ చేయడంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం కీలకం. ఆ విభాగంలో కీలక హోదాల్లో పనిచేసే ఉద్యోగులు ఆన్‌డ్యూటీ పేరిట ఏళ్ల తరబడి పాతుకుపోయారు. డీలర్ల లైసెన్సులు జారీ, రెన్యూవల్ చేయాలంటే ఒక్కో ఫైల్‌కు ఒక్కోరేటు ఉంటుందని, అందుకు పైరవీలు చేసి ఏళ్ల తరబడి సీటు వదలడం లేదనే విమర్శలున్నాయి. రెగ్యులర్ సిబ్బందిని కాదని ఆన్‌డ్యూటీ పేరిట డిప్యుటేషన్‌పై వచ్చిన సిబ్బందికి కీలక బాధ్యతలు జేడీఏ అప్పగించడం వెనుక ఆంతర్యమేమిటని? పలువురు ప్రశ్నిస్తున్నారు.

లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.25వేలు

జిల్లాలో ఫెర్టిలైజర్స్ లైసెన్స్ డీలర్లు 800, పెస్టిసైడ్స్ విక్రయ డీలర్లు 1,200, సీడ్స్ విక్రయ డీలర్లు 500మందికి పైగా ఉన్నారని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. గతంలో రెండేళ్లకు ఒకసారి లైసెన్స్ రెన్యూవల్ చేసేవారు. ప్రస్తుతం ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేస్తున్నట్లు ఎరువులు, పురుగుమందుల విక్రయ డీలర్ల సంఘం నాయకుడు ఒకరు పేర్కొన్నారు. ఏటా సరాసరి 450-500 లైసెన్సులు రెన్యూవల్ చేయాల్సి ఉంటుంది. ఒక లైసెన్సు రెన్యూవల్ కోసం సుమారుగా రూ.25వేలు మామూళ్ల కింద ఇచ్చుకోవాల్సి వస్తుందని, ఇవ్వకపోతే లేనిపోని కొర్రీలు పెట్టి వెనక్కి పంపుతున్నారని డీలర్ల సంఘం నాయకులు వాపోతున్నారు.

ఐదారేళ్లుగా ఆ సీటు..

క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పెస్టిసైడ్ లైసెన్సు జారీ, రెన్యూవల్ విభాగం చూసే సీనియర్ అసిస్టెంట్ ఐదారేళ్లుగా ఆ సీటు వదలడం లేదు. ఆయన ఒరిజినల్ పోస్టు కర్నూలులోని భూసారపరీక్ష (ఎస్‌సీ) ఆఫీసులో పనిచేయాల్సి ఉంటే ఓడీ డిప్యుటేషన్ పేరిట డీఏవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. వైసీపీ హయాంలో.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల ఏడీఏ ఆఫీసులో పనిచేస్తూ బదిలీపై ఎమ్మిగనూరు వ్యవసాయ క్షేత్రం (ముగతి ఫారం) డీడీఏ ఆఫీసుకు సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వెళ్లారు. అక్కడ జీతం తీసుకుంటూ ఓడీ పేరిట నాలుగేళ్లకు పైగా డీఏవో ఆఫీసులో పని చేస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ఎమ్మిగనూరు నుంచి కర్నూలులోని భూసార పరీక్ష (ఎస్‌సీ) విభాగానికి బదిలీ అయ్యారు. అక్కడ విధుల్లో చేరిన పది రోజులకే డిప్యుటేషన్ పైన మళ్లీ డీఏవో కార్యాలయంలో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో అదేస్థానంలో కూర్చొబెట్టడం విమర్శలకు తావిస్తుంది.

మరో సీనియర్ అసిస్టెంటు..

సీడ్ లైసెన్సు విభాగం చూస్తున్న మరో సీనియర్ అసిస్టెంట్ కూడా ఇక్కడే పాతుకుపోయారు. వైసీపీ హయాంలో ఆయన ఆలూరు ఏడీఏ ఆఫీసులో పోస్టింగ్ తీసుకొని ఓడీ పేరిట డీఏవో ఆఫీసులో విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాధారణ బదిలీల్లో భాగంగా ఆలూరు నుంచి ఆదోని ఏడీఏ ఆఫీసు సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. విధుల్లో చేరారే తప్పా ఒక్కరోజూ కూడా ఆ సీటులో కూర్చోలేదని తెలుస్తుంది. ఓడీ పేరిట డీఏవో ఆఫీసులో సీడ్ లైసెన్స్ విభాగం సీటుకు వచ్చేశారు. ఆదోనిలో పని లేకపోవడంతో కర్నూలు డీఏవో ఆఫీసుకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారా? అంటే అదీలేదు. జిల్లాలో అత్యధికంగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు ఆదోనిలోనే ఉన్నారు. కొత్త లైసెన్సులు, రెన్యూవల్‌తోపాటు రెగ్యులర్ ఆఫీసు పనులు ఉన్నాయని, పైఅధికారులు డిప్యుటేషన్ పైన డీఏవో ఆఫీసులకు తీసుకెళితే కాదనలేము కాదా? అని స్థానిక అధికారులు పేర్కొనడం కొసమెరుపు. డీఏవో ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఆలూరు ఏడీఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన మరో ఉద్యోగి కూడా ఆన్‌డ్యూటీ పేరిట డీఏవో ఆఫీసులోనే అతుక్కుపోవడం విమర్శలకు తావిస్తుంది.

ఆఫీసు పనుల కోసమే ఓడీ

ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు అమలు, రెగ్యులర్ కార్యాలయం పనుల కోసమే అవసరాన్ని బట్టి ఆన్‌డ్యూటీలో డిప్యుటేషన్ పైన ఉద్యోగులకు డీఏవో ఆఫీసులో నియమించిన మాట నిజమే. ఒకే విభాగంలో ఏళ్ల తరబడి ఒకే ఉద్యోగిని నియమించలేదు. అప్పుడప్పుడు విభాగాలు మారుస్తూ ఉంటాం. ఇచ్చిన పనులు చేయడానికి చేతకాని వాళ్లే ఇలాంటి ఆరోపణలు చేస్తారు.

- వరలక్ష్మి, జేడీఏ, వ్యవసాయ శాఖ, కర్నూలు



కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం

సత్యసాయి సేవలు శాశ్వతం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా ప్రాజెక్టుల నిర్మాణం పరంగా, వైద్యకళాశాలలు, విద్యాసంస్థల పరంగా చేసిన సేవలు శాశ్వతమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 166 దేశాల్లో సాయి సేవా సంస్థలు ఉన్నాయన్నారు. సంస్థల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విద్యా, వైద్యం, మానవత, ఆధ్యాత్మిక సామాజిక సేవలను అందించారన్నారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదుసూత్రాలతో బాబా జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ సీఎండీ'

కల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ' నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు నిర్వహించే కార్యక్రమాన్ని డిస్కం పరిధిలోని ఆయా జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈమేరకు మొబైల్ నెంబరు: 8977716661కు ఫోన్ చేయాలని కోరారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా?

- ట్రైనీ ఐఏఎస్‌లు
- ఆరేకల్లులో పర్యటన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

ఆదోని రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ట్రైనీ ఐఏఎస్‌లు లోకేశ్‌సింగ్, అమిత్ మీనా, భార్గవ్‌రామ్, జతీన్‌జైన్, అర్షిత్ గోయిల్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శనివారం రాత్రి వీరు మండలంలోని ఆరేకల్లుకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం వీరంతా అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, ఆర్బీకె సెంటర్, రేషన్ డీలర్ దుకాణాన్ని పరిశీలించడంతో పాటు సాయంత్రం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంపై విధి విధానాలను అడిగి తెలుసుకోవడంతో పాటు లోటుపాట్లపై ఆరాతీశారు. పొదుపు మహిళలతో ప్రత్యేక భేటీ అయ్యారు. వీరి వెంట రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, సర్పంచ్ లోహిత్ ప్రియా, టీడీపీ సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, వైసీపీ నాయకుడు వీరాస్వామి ఉన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

- ఇప్పటి దాకా 12 కేసులు నమోదు
- రూ.90వేలు జరిమానా విధించాం
- కలెక్టర్ సిరి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లకు సంబంధించి వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ సిరి హెచ్చరించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదు వచ్చాయన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 22 వరకు లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని, కోసిగి మండలాల్లో ఉన్న పత్తి కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్లు వేబ్రిడ్జిలు, జిన్నింగ్ ప్రెస్ యూనిట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. కొందరు వ్యాపారులు ఉపయోగిస్తున్న తూకపు యంత్రాలు, రీవెరిఫికేషన్, స్టాంపింగ్ గడువు దాటినవని గుర్తించి లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం 12 కేసులు నమోదు చేశామన్నారు. వారి నుంచి రూ.90వేలు జరిమానాలు విధించినట్లు తెలిపారు. గ్రామాల్లోనే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై ఆయా మార్కెట్ కమిటీల సెక్రటరీలు, మార్కెటింగ్ శాఖ అధికారులు నిఘా ఉంచి వారిని నియంత్రించాలని కలెక్టర్ ఆదేశించారు.



కాటను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

పెరిగిన వేరుశనగ ధర

క్వింటా గరిష్ఠం రూ.7,109



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన వేరుశనగ

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుశనగ ధర కాస్త పెరిగింది. గతవారంలో వేరుశనగ తక్కువ ధరలు నమోదయ్యాయి. ఆదివారం వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం వేరుశనగ 2133 బస్తాలు (640కింటాళ్లు), ఆముదాలు 539బస్తాల (270క్వింటాళ్లు) ను రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. వేరుశనగ క్వింటాం కనిష్ఠ ధర రూ.3,416లు, గరిష్ఠం రూ. 7,109లు పలికింది. ఆముదాలు క్వింటాం కనిష్ఠ ధర రూ.5,280లు, గరిష్ఠం రూ.5,807లు పలికింది.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం

- తొమ్మిది మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద ఘటన

7

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

మంత్రాలయం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం పోటెత్తింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు మఠం పండితుల ఆశీస్సులు పొందారు.

అన్యమత స్టిక్కర్లతో శ్రీశైలంలోకి కారు

- భద్రతా వైఫల్యమే కారణం
- హిందూ సంఘాల ఆగ్రహం



అన్యమత స్టిక్కర్లు కనిపించకుండా లేబుల్స్ వేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్యమత స్టిక్కర్లతో శనివారం అర్ధరాత్రి నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలోకి కారు ప్రవేశించడం కలకలం రేపింది. శివసదనం ఐవోసీ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కారును అటుగా వెళ్తున్న వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు గమనించి ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది కారును తనిఖీ చేయగా కారుపై అన్యమతానికి చెందిన క్యాప్షన్లు, ఫొటో స్టిక్కర్లు, సైడ్ మిర్రర్లు, నెంబరు ప్లేటుపై మిషన్ తాలుకా పేరు, డ్యాష్‌బోర్డుపై గ్రంథం, డిక్కీలో కరపత్రాలు ఉన్నట్లు ఆలయ భద్రత అధికారి దృష్టికి తీసుకెళ్లామని హిందూ సంఘాల నాయకులు చెప్పారు. అయితే కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న ఆలయ భద్రత అధికారి కారు డ్రైవరును నామమాత్రంగా విచారించి స్థానిక పోలీసులకు అప్పగించకుండా వదిలివేశారని వారు ఆరోపించారు. కారు నిండా క్యాప్షన్లు, ఫొటోలతో ఉన్న కారు టోల్‌గేటు దాటి క్షేత్రంలోకి ప్రవేశించడం భద్రతా సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విశ్వహిందూ పరిషత్ శ్రీశైలం మండల అధ్యక్షుడు నారాయణ అన్నారు. కొందరు అయ్యప్ప స్వాములు తెలిసిన వారి కారును తీసుకుని వచ్చారని, వారికి తెలియక క్షేత్ర దర్శనానికి వచ్చినట్లుగా సీఎస్‌వో పొంతన లేని సమాధానం చెబుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కారులో వచ్చిన స్వాములను కనీసం చూడకపోగా, మరో మతానికి చెందిన కారు డ్రైవరును పూర్తిస్థాయిలో విచారించకుండా విడిచిపెట్టారని, అలాగే కారును ఇక్కడి నుంచి పంపించేశారని వారు చెప్పారు. ఈ ఘటనపై సీఎస్‌వోను విచారించాలని ఈవోను కోరారు.

ప్రచారానికి రాలేదు : ఈవో శ్రీనివాసరావు

అన్యమత పోస్టర్లతో ఉన్న కారులో అయ్యప్పస్వాములు వచ్చినట్లు ఆలయ భద్రతా అధికారి తెలిపిన వివరాల ప్రకారం పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులకు చెప్పాం. క్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం వంటివి నిషేధం. అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

విచారించి కేసు నమోదు చేస్తాం : సీఐ ప్రసాదరావు

ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారిస్తాం. ప్రకారం ఆలయ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై దేవదాయ ధర్మదాయ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తాం.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం

- తొమ్మిది మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద ఘటన


పేరాయిపల్లె మెట్ట వద్ద ప్రైవేట్ బస్సును ఢీకొట్టిన లారీ


మృతి చెందిన హరిత, బద్రీనాథ్

ఆళ్లగడ్డ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ప్రైవేటు బస్సును లారీ ఢీకొట్టడంతో ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. తొమ్మిది మంది గాయపడగా.. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం ఆళ్లగడ్డ మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుఝామున జరిగింది. వివరాలివీ.. మైత్రి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి 33 మంది ప్రయాణికులతో శనివారం పాండిచ్చేరికి బయలు దేరింది. ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్దకు రాగానే ఇద్దరు ప్రయాణికులు బహిర్భూమికి వెళ్లాలని డ్రైవర్‌ను కోరడంతో ఆయన బస్సును రోడ్డు పక్కన నిలిపారు. అయితే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో వెనుక సీట్లో కూర్చున్న పాండిచ్చేరికి చెందిన పి.హరిత(23), జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన గడ్డం బద్రీనాథ్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన చీపు శ్రీవాణి, వంశీ, బండ్ల శ్రావ్య, సాయివంశీ, అమలాపురానికి చెందిన ఎం.గణేశ్, రాయచోటికి చెందిన ఖాదర్‌వలి, ఆశాభేగం, కాజీపేట మండలం మిడుతూరు గ్రామానికి చెందిన అల్లూరి దొరస్వామి, చెన్నూరుకు చెందిన సుబ్బయ్య, అలాగే హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ గాయపడ్డారు. క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఖాదర్‌వలి, ఆశాభేగం, బండ్ల శ్రావ్య, సురేశ్‌ను నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, సీఐలు మురళీధర్‌రెడ్డి, యుగంధర్, ఎస్ఐ జయ్యప్ప ఘటనా స్థలానికి చేరుకొని లారీలో ఇరుక్కొని ఉన్న డ్రైవర్‌ను క్రేన్ సాయంతో బయటి తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ నలుగురిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విహార యాత్రకు బయలుదేరి అనంత లోకాలకు..

గడ్డం బద్రీనాథ్, హరిత స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పాండిచ్చేరిలో ఉన్న స్నేహితులను కలిసి అక్కడే విహార యాత్రకు వెళ్లాలని హైదరాబాద్ నుంచి బయలుదేరారు. సీటు నెంబరు ఎఫ్-6 బద్రీనాథ్‌కు, ఎఫ్-2 హరితకు రిజర్వ్ అయింది. అయితే తనకు రిజర్వ్ అయిన ఎఫ్-2 సీట్‌లో కూర్చోవాలని హరిత ఎఫ్-4 సీటులో కూర్చున్న హైదరాబాద్‌కు చెందిన నరసింహారెడ్డిని విజ్ఞప్తి చేసింది. దీంతో ఇద్దరూ తమ సీట్లను ఎక్స్‌ఛేంజ్ చేసుకున్నారు. స్నేహితులిద్దరూ సమీపంలోని సీట్లలో కూర్చున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు.

కష్టపడి చదివించిన తల్లిదండ్రులు

జోగులాంబ గద్వాలకు చెందిన లక్ష్మీనారాయణ, రమాదేవి కుమారులు గడ్డం బద్రీనాథ్, గడ్డం సాయిని తల్లిదండ్రులు కష్టపడి చదించారు. బద్రీనాథ్ బీటెక్ పూర్తి చేసి హైదరాబద్ లోని ఇన్ఫోసెస్ కంపెనీలో ఏడాది క్రితం ఉద్యోగం సంపాదించాడు. అలాగే చిన్న కుమారుడు సాయి ముంబైలో బెటెక్ చేస్తున్నాడు. తండ్రి లక్ష్మీనారాయణ వాచ్ రిపేరి సెంటర్ ద్వారా, తల్లి రమాదేవి టైలరింగ్ చేస్తూ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. చేతికి అందిన కుమారుడు తిరిగి రాని లోకాలు వెళ్లి పోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ఘటనా స్థలాన్ని సునీల్ షెరాన్ పరిశీలించారు. ప్రమాద వివరా లను డీఎస్పీ ప్రమోద్, సీఐలు మురళీ. దర్‌రెడ్డి, యుగం. దర్‌ను అడిగి తెలుసుకున్నారు.


సంఘటనా స్థలంలో ఎస్పీ

మూడిళ్లలో దొంగతనం


దొంగలు పగలగొట్టిన బీరువా

నంద్యాల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తెలుగు పేట, అనకాలపేటలో మూడు ఇళ్లల్లో శనివారం రాత్రి దొంగతనాలు జరిగాయి. ఆదివారం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుపేటలో సుబ్రమణ్యం అనే వ్యక్తి రాత్రి భోజనం చేసి ఇంటిపైగదిలో నిద్రించడానికి వెళ్లారు. తెల్లవారుజామున కిందికి వచ్చి చూడగా తాళం పగిలిఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఏడుతులాల బంగారు అభరణాలు, పావుకిలో వెండి, వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీకి గురయ్యాయి. అదే వీధిలో గురమ్మ అనే వృద్ధురాలు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టారు. అయితే ఇంట్లో ఏమీ దొరకకపోవడంతో వెనుదిగారు. అలాగే అనకాలపేటలో ఓ ఇంటి తాళం పగలగొట్టడానికి యత్నిస్తుండగా ఇంటి పక్కనే ఉన్నవారు లైట్ ఆన్ చేయడంతో వెనుదిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చోరీలు చేసేందుకు నంద్యాలకు కొత్త గ్యాంగ్ వచ్చిందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యార్థం బెంగళూరు-నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు వేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎస్ఆర్-బెంగుళూరు-హజ్రత్ సాహెబ్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్ నెంబరు:16593కు డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 15 వరకు ఒక ఏసీ త్రీటైర్, ఒక స్లీపర్, ఒక జనరల్ కోచ్‌లను అదనంగా జత చేసి పంపుతున్నామన్నారు. దీనికి తిరుగు ప్రయాణం రైలు నెంబరు: 16594కు డిసెంబరు 3 నుంచి జనవరి 17 వరకు ఒక ఏసీ త్రీటైర్, ఒక స్లీపర్, ఒక జనరల్ కోచ్‌లను చేర్చి నడపుతున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బేతంచెర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన నాయకంటి సుజాత (23) అనే మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ తెలిపారు. వివరాలు.. హనుమాన్‌నగర్‌కు చెందిన సుజాత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుం డేది. ఈనెల 21న రాత్రి వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం భర్త హరీష్, బంధువులు మెరుగైన వైద్యంకోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతిచెందింది. భర్త, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన సున్నం మహేష్(50) ఆదివారం తన ఇంటిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్య సమస్యలే కారణమన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మద్యం స్వాధీనం

వెలుగోడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఓవ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేశ్ ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఆర్టీసీ కండక్టర్‌పై శనివారం రాత్రి దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటనలో పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. కండక్టర్ మురళికృష్ణ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ప్రయాణికురాలు కళ్యాణి ఫిర్యాదు మేరకు కండక్టర్‌పై కేసు నమోదు చేశారు. కండక్టర్, డ్రైవర్‌పై దాడి చేసి బస్సు అద్దాలు ధ్వంసం చేసినందుకు ప్రయాణికురాలి భర్త కిరణ్, కొడుకు, మరి కొంత మందిపై మరో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

30న కాంగ్రెస్ కేంద్ర కమిటీ పర్యటన

డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్ తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కేంద్ర కమిటీ పర్యటిం చనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడు ముందు ఉంటా నన్నారు. పార్టీలో పనిచేస్తున్న ఆశావాహులు, కార్యకర్తలు డీసీసీ, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. ఆ నివేదికను అధిష్టానానికి సమర్పిస్తానన్నారు. అధిష్టానం అర్హులను ఎంపిక చేస్తుందన్నారు. డోన్ నియోజకవర్గం సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి, నంద్యాల డీసీసీ ఉపాధ్య క్షులు జనార్దన్, బాలస్వామి, అసంఘటిత కార్మిక సంఘం కర్నూలు, అనంతపురం ఇన్‌చార్జి పఠాన్ హబీబ్‌ఖాన్, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి రజాక్‌వలి, జిల్లా కార్యదర్శి హుస్సేన్‌బేగ్ పాల్గొన్నారు.

సర్వీసు రూల్స్ అమలు చేయాలి

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య


మాట్లాడుతున్న మిట్ట కృష్ణయ్య

చాగలమర్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సర్వీసు రూల్స్ తక్షణమే అమలు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టకృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చాగలమర్రి పీఆర్టీయూ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ పీఆర్టీ కమిటీ ఛైర్మన్‌ను నియమించాలని, ఇంటిరియల్ రీలిఫ్ 30 శాతం ప్రకటించాలని, మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్ 180 రోజులు పదవీ విరమణ లోపు వాడుకునేలా జీవో ఇవ్వాలని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను కేటాయించాలని, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, రాష్ట్ర కౌన్సిలర్ రవింద్రారెడ్డి, పీఆర్టీయూ నాయకులు మౌలాలి, ఆంజనేయరెడ్డి, దాదాపీర్, రవిప్రకాష్‌రెడ్డి, సుబ్బరాయుడు, దస్తగిరి పాల్గొన్నారు.

సత్యసాయిబాబా అందరికీ ఆదర్శం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- ఘనంగా శతజయంతి


సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, విజయభారతి

ఓర్వకల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా అందరికీ స్ఫూర్తి, ఆదర్శమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని బాలభారతి పాఠశాలలో మండల ఐక్యసంఘం గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో శతజయంతి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం వంద మంది మహిళలకు చీర, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవే పరమ ధర్మం అని బాబా చేసిన బోధనలే లక్షల మందికి మార్గం చూపాయన్నారు. అనంతపురం జిల్లా సత్యసాయిబాబా సేవా ట్రస్టు ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు, ఉచిత శస్త్ర చికిత్సలు కిడ్నీ ఆపరేషన్లు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేశారన్నారు. పేద విద్యార్థులకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందజేశారన్నారు.

'అన్సర్ జ్యువెలర్స్' ప్రారంభం


అన్సర్ జ్యువెలర్స్ షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ అన్సర్ డైమండ్, గోల్డ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆదివారం ప్రారంభించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సరసమైన ధరలకే నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు అందించడం అన్సర్ జ్యువెలర్స్ ప్రత్యేకం అన్నారు. పట్టణంలోని అన్సర్ జ్యువెలర్స్‌లో నాణ్యమైన ఆభరణాలు లభిస్తున్నాయని అన్నారు. నంద్యాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్సర్‌జువెలర్స్ అధినేతలు అన్సర్, అమీర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంకురా అపెక్స్ హాస్పిటల్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, 'కుడా' ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో అంకురా అపెక్స్ హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆదివారం ఉదయం ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కేడీసీసీబీ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గైనకాలజిస్టు అండ్ ఫెర్టిలిటీ స్పెషలిస్టు డా.ఎంసీ మల్లేశ్వరి, జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డా.జీవీ రమణ మాట్లాడుతూ వంద పడకలతో హైదరాబాదు తరహాలో ప్రారంభించామన్నారు. గైనకాలజీ, యూరాలజీ, ఫెర్టిలిటీ సెంటర్ అన్ని రకాల వాస్కులర్ సర్జరీ, మెడిసిన్, సర్జరీ, ల్యాపోస్కోపిక్ సర్జరీలు, ఆర్థో, మోకాళ్ల ఆపరేషన్, ఎస్ఐసీయూ, ఐసీయూ, నెఫ్రాలజీ, డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాస్కులర్ సర్జరీ డిపార్టుమెంట్ 20 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ అత్యాధునికంగా ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు డా.ప్రసన్న కుమారి, డా.జాగృతి, డా.చిట్టిబాబు సభ్యులు పాల్గొన్నారు.

'రైతన్న మీకోసం'కు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి 29వ తేదీ వరకు కార్యక్రమాలు
- వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'రైతన్న మీకోసం' కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆయా మండలాల్లోని ప్రజాప్రతినిధులంతా పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి రైతులకు పంచసూత్రాల గురించి వివరించనున్నారు. నీటి భద్రత, డిమాండ్ ఉన్న ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు గురించి రైతులకు వివరిస్తారు. వ్యవసాయ శాఖ తయారు చేసిన ఫార్మర్ యాప్‌ను ప్రతి రైతుకు చేరువ చేయాలన్నారు. సోమవారం నుంచి 29వ తేదీ వరకు ప్రతి గ్రామంలో రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జేడీ తెలిపారు. డిసెంబరు 3న గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సమా వేశాన్ని నిర్వహిస్తామన్నారు. రైతుల ప్రయోజనాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు.

నేటి రాజకీయాలకు దర్పణమే 'ఛైర్మన్' నాటకం


పత్తి ఓబులయ్యతో కళాకారులు

కర్నూలు కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేటి రాజకీయాలకు దర్పణంగా 'ఛైర్మన్' నాటకం నిలుస్తుందని హైదరాబాద్ రసరంజని కళా సంస్థ ఛైర్మన్ డి.రామకోటేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో 'ఛైర్మన్' నాటక ప్రదర్శన నిర్వహించారు. రాజకీయ నాయకుల్లో సేవాగుణం పోయి పదవి కాంక్ష పెరిగిపోయిందన్నారు. 1962లోనే దివంగత నాటక రచయిత కొడాలి గోపాలరావు రాశారని గుర్తుచేశారు. పత్తి ఓబులయ్య దర్శకుడు డి.రామకోటేశ్వరరావుకు టీజీవీ కళాక్షేత్రం తరపున రూ.35వేల పారితోషికం అందజేసి, కళాకారులను సన్మానించారు. కళాకారులు కృష్ణమూర్తి, డొక్కా బాచి, అవినాష్, మోహన్, శ్రీజ సాదినేని, ఘనపురం శశి, కేకే రెడ్డి, అఖిల్, పుండరీక్ తమ నటనతో మెప్పించారు. కన్వీనర్లు కేవీ రమణ, కదిరి రమేష్, కళాక్షేత్రం కార్య దర్శి సి. యాగంటీశ్వరప్ప, ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, కళాకారులు పి. రాజారత్నం, చల్లా నవీన్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌ని కలిసిన కేశన్నగౌడు


కేఈ ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఈ కేశన్నగౌడు

డోన్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేఈ ప్రభా కర్‌ను డోన్ మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు ఆదివారం కర్నూలులో కేఈ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేశన్నగౌడు మాట్లాడుతూ కేఈ కుటుంబం బీసీలకు అండగా నిలిచిందన్నారు. కేఈ ప్రభాకర్ జన్మదిన వేడుకల్లో కేశన్నగౌడు పాల్గొని కేక్ కట్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి జన్మదిన వేడుకలు గొప్పగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని పని చేసిన వారికి న్యాయం జరుగుతుందన్నారు. అందరం కలిసికట్టుగా టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కేఈ ప్రభాకర్‌ను కలిసిన వారిలో కిరణ్ యా దవ్, ఓబులాపురం మనోహర్, రాము గౌడు, రంగస్వామి గౌడు, సుదర్శన్ గౌడు, ధర్మవరం మద్దిలేటి, ఇమామ్ ఉన్నారు.

'ఏపీ టూరిజం' పేరుతో నకిలీ వెబ్‌సైట్

- మోసపోయిన మల్లన్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులు బస చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుని మోసానికి గురవుతున్నారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన రాజీవ్ తను కుటుంబ సభ్యులు ఆరుగురు శ్రీశైలం ఏపీ టూరిజం హరిత హోటల్‌కు చేరుకున్నారు. ఆన్‌లైన్‌లో రూ.6 వేల రూపాయలు చెల్లించి చేసుకున్న బుకింగ్ రసీదు చూసిన హరిత అధికారులు సిబ్బంది దానిని నకిలీదిగా గుర్తించారు. అలాగే బెంగళూరుకు చెందిన ఆర్మీ అధికారి కృష్ణమూర్తి కూతురు జన్మదినం సందర్భంగా భార్య పిల్లలు, తల్లితో కలిసి క్షేత్రానికి వచ్చారు. వీరు కూడా అదే విధమైన వెబ్‌సైట్ ద్వారా మోసపోయినట్లు తెలియడంతో ఖంగుతిన్నారు. బాధితులు మాట్లాడుతూ గూగుల్‌లో ఏపీ హరిత హోటల్ అని సెర్చ్ చేసి మొదటి వెబ్‌సైట్‌లో లావాదేవీలు జరిపినట్లు చెప్పారు. ఆర్మీ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ క్షేత్ర పరిధిలో మొబైల్ సిగ్నల్స్ లేవని కేవలం వాట్సప్ వాయిస్ కాల్ మాత్రమే మాట్లాడి బురిడీ కొట్టించాడని తెలిపారు. అదే విధంగా గర్భాలయ స్పర్శ దర్శనం గురించి అడగ్గా.. ఆలయంలోని అర్చకులు తనకు బాగా పరిచయమేనని నకిలీ మేనేజర్ మనీష్ చెప్పినట్లు పేర్కొన్నారు. వసతి గదులు బుకింగ్ ఓకే చేయాలంటే ఆన్‌లైన్ ద్వారా నగదు పంపామని చెప్పారు. మొదటి సారి నిఫ్ట్ ద్వారా పంపామని, అయితే దీని ద్వారా బుకింగ్ వెంటనే కన్ఫర్మ్ చేయాలేమని చెప్పారన్నారు. మరోసారి ఐఎంపీస్ ద్వారా పంపితే మొదట చేసిన డబ్బులను తిరిగి పంపతామని చెప్పి రెండు సార్లుగా మొత్తం రూ.30 వేల రూపాయలు పంపించామని బాధితులు చెప్పారు. నగదు బదిలీ సమయంలో కాస్తంత అనుమానం కలిగిన ఆర్మీ అధికారిని మనీష్ మాటలతో సతమతం చేస్తూ గత 10 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నట్లు నమ్మించాడని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక టూరిజం సంస్థకు నకిలీగా జరుగుతున్న ఆన్‌లైన్ మోసానికి అడ్డుకట్ట వేసి భక్తుల సొమ్ము దొంగలపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. క్షేత్రంలో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ప్రత్యామ్నాయ వసతి ఏర్పరుచుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు.



గూగుల్‌లో కనిపిస్తున్న ఫేక్ వెబ్‌సైట్



ఆర్మీ అధికారికి పంపిన రసీదు

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న సీఈవో

ఓర్వకల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి సూచించారు. ఆదివారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఆర్వో ప్లాంటును, బియ్యం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఎంపీడీవో నాగ అనసూయ, ఎంఈవో ఓంకార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తాం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కలిసి పని చేస్తామని మాజీ డీసీసీ కె.బాబురావు అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి జె.లక్ష్మీనరసింహ యాదవ్‌తో తనకు వ్యక్తిగత విభేదాలు లేవన్నారు. తనపై సస్పెన్షన్‌ను ఎత్తి వేసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాహుల్ గాంధీ, క్రమ శిక్షణా సంఘం చైర్మన్ లింగం శెట్టికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా, ఎస్సీ బజారన్న, బి. సుబ్రహ్మణ్యం, షేక్ ఖాజా హుస్సేన్, లాజర్, ఖాద్రీ, రేపల్లే ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, హేమంత్ కుమార్, వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి యోహోవా, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న పాత్రికేయులతో వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఽ కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డా.జి.సుధాకర్, సీఈవో డా.సునీల్ సేహూరీ సూచించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ, కిమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పాత్రికేయులకు మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా.అరుణ కురుకుంద నేతృత్వంలో గుండెకు సంబంధించిన పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, సిరంక్రియాటిక్, 2డీ ఇకో, జీఆర్‌బీఎస్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధుల నిర్ధారణకు అవరమయ్యే అదనపు పరీక్షలపై 50 శాతం రాయితీలు ఇస్తున్నట్లు ప్రకటించారు.

కళాశాలలను సీజ్ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని కళాశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం క్లాసులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాల వద్ద బైఠాయించారు. అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ మాట్లాడుతూ నిబంధనలను తుంగలో తొక్కి సెలవు రోజుల్లో కూడా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాల్లో చెలగాటం ఆడుతున్నారనీ ఆరోపించారు.

నేటి నుంచి 'జల సమర దీక్ష'

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు సోమవారం నుంచి 48 గంటల 'జల సమర దీక్ష చేస్తున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం రాజవిహార్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ, దీక్ష చేస్తామన్నారు.

కోల్స్ చర్చిలో నూతన పాలక వర్గం

కర్నూలు కల్చరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన పాలకవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. చర్చి పూర్వ అధ్యక్షుడు ఏడీ అబ్రహాం లింకన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా అన్నెపోగు సొలోమోన్, కార్యదర్శిగా రెడ్డిపోగు అనిల్ నాథ్, కోశాధికారిగా ఎస్ చార్లెస్, యూత్ డైరెక్టర్‌గా డాక్టర్ పగడాల సుచిత్ర విజయ్, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా దాసరి స్వర్ణలత ఎన్నికయ్యారు. పాస్టర్లు రెవ.ఆర్ అనిల్ సామ్యూల్, రెవ.ఎస్‌జే జీవన్ ప్రార్థనలు చేసి, ఆశీర్వదించారు.



చర్చి నూతన పాలక వర్గం





కర్నూలు మార్కెట్ యార్డు ఒకప్పుడు చెత్త కుప్పలా గుర్తింపు ఉండేది. రెండు నెలల్లో రోజూ వేల క్వింటాళ్ల ఉల్లి తీసుకురావడం, అవి కుళ్లిపోవడంతో దుర్వాసన వచ్చేది. యార్డుకు వచ్చిన రైతులు, కార్మికులు అనారోగ్యాలబారిన పడ్డారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో యార్డు ఇప్పుడు పరిశుభ్రంగా ఉంది. యార్డులో దాదాపు రూ.1 కోటి ఖర్చు పెట్టి చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ఇకపై మార్కెట్‌యార్డులో ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడేస్తే కఠిన చర్యలు తప్పని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరించారు. కమీషన్ ఏజెంట్లు తామే సిబ్బందిని ఏర్పాటు చేసుకుని చెత్తను తొలగించుకోవాలని సూచించారు. **- కర్నూలు అగ్రికల్చర్**

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరిస్తామని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగర పరిధిలోని ప్రజలు తమ కాలనీలో స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు https://meekosam.ap.gov.in నందు చూడవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మరమతు పనుల్లో భాగంగా బళ్లారి సెక్షన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సెంట్రల్ ఫీడర్‌లోని కొత్త బస్టాండ్, ఈద్గా ఏరియా, మహావీర్ నగర్ ఏరియాలో సరఫరా నిలిపివేస్తున్నామని, ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

- రాష్ట్రస్థాయి తైక్వాండోలో 13 , ఈత పోటీల్లో 11 పతకాలు
- నలుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపిక



తైక్వాండో క్రీడాకారులతో అతిథులు



పతకాలు సాధించిన స్విమ్మర్లు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు రెండు బంగారు పతకాలు, ఒక రజిత పతకాన్ని, 10 కాంస్య పతకాలు సాదించారు. ఆదివారం షరీన్‌నగర్‌లో ఉన్న వెంకటేశ్ తైక్వాండో సెంటర్‌లో భారత సెపక్‌తక్రా సంఘం ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసులు క్రీడాకారులను అభినందించారు. జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అక్కడ కూడా రాణించాలని ఆకాంక్షించారు. కోచ్ వెంకటేశ్, నాగన్న విద్యార్థులు పాల్గొన్నారు.

- విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పదో సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్-2025 ఈత పోటీల్లో జిల్లా స్విమ్మర్లు ప్రతిభ కనబరిచారు. ఒక బంగారు పతకం, 5 వెండి, కాంస్య పతకాలు- 5 మొత్తం 11 మెడల్స్ సాదించారు. గ్రూప్-1 విభాగంలో ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాదించారు. స్విమ్మర్లను డీఎస్‌డీవో భూపతిరావు, కోచ్ నటరాజ్, డిస్ట్రిక్ట్ అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ ఆచారి, సెక్రటరీ రామకృష్ణ యాదవ్, ట్రెజరర్ దస్తగిరి, జాయింట్ సెక్రటరీలు రామకృష్ణ శివరాజ్ అభినందించారు.

సమస్యలపై ప్రభుత్వం మొద్దు నిద్ర



మాట్లాడుతున్న ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రతో వ్యవహరిస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా, 12వ పీఆర్‌సీ,గానీ, మధ్యంతర భృతి ఇవ్వలేదన్నారు. అసెస్‌మెంట్ పుస్తకాలు సిలబస్‌కు సంబంధం లేకుండా ప్రశ్నాపత్రాల రూపకల్పన, ఉమ్మడి సర్వీసు రూల్స్ పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మెమో.57 ప్రకారం పాత పెన్షన్ విధానం తీసుకువచ్చేలా జోక్యం చేసుకోవాలని కోరారు. ఎన్నికల పరిశీలకుడు సూర్యుడు, ఎన్.రమణారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్న, షణ్ముర్తి, రమేష్, హెచ్.తిమ్మన్న, జిల్లా ప్రధాన ఆర్థిక కార్యదర్శులు టీకే జనార్దన్, రామ్మోహన్ రెడ్డి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలిపారు



సీపీఆర్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి స్పృహ కోల్పోయిన ఆటోడ్రైవర్‌కు గ్నిమాపక సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడారు. వివరాల మేరకు.. చెట్లమల్లాపురం గ్రామానికి ఓ ఆటోడ్రైవర్ కర్నూలు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లైఓవర్ వద్ద ఆటో బోల్తా పడింది. డ్రైవర్ స్పృహ కోల్పోగా అనంతపురం వైపు నుంచి వస్తున్న అగ్నిమాకప సిబ్బంది రఘురాముడు, జయరాముడు స్పృహ కోల్పోయిన డ్రైవర్‌కు సీపీఆర్ చేయడంతో ఆటో డ్రైవర్ స్పృహలోకి వచ్చాడు. అనంతరం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్ కోలుకుంటున్నాడు.

కబడ్డీ ఛాంపియన్‌గా తూర్పు గోదావరి, చిత్తూరు జట్లు



రన్నర్స్‌గా నిలిచిన కర్నూలు జట్టుకు ట్రోఫీ ఇస్తున్న కేఈ ప్రభాకర్

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జహరాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో తూర్పు గోదావరి, చిత్తూరు జిల్లా జట్లు చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో తూర్పు గోదావరి జట్టు, కర్నూలు జట్టుపై 44-14 పాయిట్ల తేడాతో విజయం సాదించింది. బాలికల ఫైనల్‌లో చిత్తూరు జిల్లా జట్టు 38-27 పాయింట్లు తో విజయం సాధించి ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. మూడు రోజుల పాటు పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తెలుగు కృష్ణ మాజీ మంత్రి, కబడ్డీ ఫెడరేషన్ మాజీ చైర్మన్ కేఈ ప్రభాకర్ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ చేయించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఎం నగర కార్యదర్శులు టి.రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు. గిడ్డయ్య మాట్లాడుతూ మారేడుమిల్లి మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, అతని భార్యతో పాటు మరో ఆరుగురు మావోయిస్టులను పోలీసులు పట్టుకుని కాల్చిచంపి, ఎన్‌కౌంటర్ అని అబద్ధాలు చెపప్పడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఓవైపు చెబుతూ మరోవైపు ఎన్‌కౌంటర్ చేయడము దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం అటవీ సంపదలను తమ ఆయానులైన కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికే గిరిజనులకు అండగా ఉన్న మావోయిస్టులను మట్టుపెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరపకపోతే వామపక్షాలు, ప్రజా సంఘాలు, పౌరహక్కుల నాయకులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఐ నగ కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి నాగన్న, వెంకటస్వామి, సుంకన్న పాల్గొన్నారు.

ముళ్లకంప తొలగింపు



ముళ్లకంపను తొలగిస్తున్న దృశ్యం

సి.బెళగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణదొడ్డి బ్రాహ్మణదొడ్డి గ్రామాల బండిరస్తాకు అడ్డంగా ఉన్న ముళ్లకంపను అధికారులు తొలగించారు. అక్టోబరు 30వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'దారి ఏదీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

శాస్త్రీయ కళలు సంస్కృతికి నిదర్శనం



అతిథులతో చిన్నారులు

కర్నూలు కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనమని లలితాపీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి అన్నారు. ఆదివారం రాత్రి బుధవారపేటలోగల సస్య ప్రైడ్ సమావేశ మందిరంలో సూర్యకళా కల్చరల్ అకాడమీ, బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శాస్త్రీయ జానపద సంగీత నృత్యోత్సవం నిర్వహించారు. సూర్యకళా కల్చరల్ అకాడమీ నిర్వాహకులు చిన్నారులను సంప్రదాయ కళల్లో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. 16వ వార్డు కార్పొరేటర్ బి.విజయకుమారి అకాడమీని అభినందించారు. బి.రామాంజినేయులు, అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బైలుపాటి సోమశంకరయ్య, కార్యదర్శి కె. పద్మావతి, శిక్షకులు బి.సుధాకర్, బి.బాలస్వామి, జాహ్నవి పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోవాలి

సి.బెళగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు పద్ధతి మార్చుకుని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలను ఇబ్బందికి గురిచేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ మాధవీ శ్యామల

కర్నూలు హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ కోశాధికారి డా.మాధవీ శ్యామల అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఐఎంఏ రాష్ట్ర సదస్సులో 'ట్రామకేర్ సామాజిక బాధ్యత'పై ఆమె మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు 50 శాతం అక్కడిక్కడే మృతి చెందుతున్నారని, మరికొందరు సరైన వైద్యం అందక మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుచక్రాల వాహనదారులు సీటుబెల్టు, పెట్టుకోవాన్నారు. అనంతరం బెస్ట్ అకాడమిక్ అవార్డును డా.మాధవి శ్యామల అందుకున్నారు.

హెల్మెట్ ధరించండి



అవగాహన కల్పిస్తున్న సీఐ తేజామూర్తి

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని తాలుకా పోలీస్ స్టేషన్ సీఐ తేజామూర్తి అన్నారు. ఆదివారం తాలుకా పోలీస్ స్టేషన్ వద్ద వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంతోమంది హెల్మెట్ ధరించపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఎస్ఐ రామాంజనేయులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 69వ రాష్ట్రస్థాయి రగ్బీ ఎస్‌జీఎఫ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆర్ఐవో లాలెప్ప, డీఎస్‌డీవో భూపతి రావు, రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్రాచారి, పరిశీలకుడు గణేష్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ఐవో లాలెప్ప మాట్లాడుతూ పోటీలను కర్నూలులో నిర్వహించడం గర్వకారణమన్నారు. కర్నూలులో నిర్వహించడం గర్వకారణమన్నారు. గెలుపు ఓటములు క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారడీడీపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

ప్రేమ, సేవే ఆధ్యాత్మికత

- నగరంలో సత్యసాయి బాబా శత జయంతి
- ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో పాల్గొన్న జడ్పీ సీఈవో నాసర రెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, సేవ నిజమైన ఆధ్యాత్మికతని సత్యసాయి బాబా సందేశం ఇచ్చినట్లు నగర పాలక డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నగర పాలక కార్యాలయంలో సత్యసాయిబాబ చిత్రపటానికి పూలమాల వేశారు. 'సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస' మానవ విలువలను అలవరచుకుంటే సమాజం మరింత సాత్వికంగా మారుతుందన్నారు. మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఐ తిప్పన్న, సిబ్బంది వినోద్, గోవిందు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఆదివారం నగరంలోని సత్యసాయి మందిరంలో నిర్వహించారు. తెల్లవారుజామున 5.30 నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, సత్యసాయి వ్రతం, కేక్ కటింగ్ చేసి భక్తులకు సాయి దర్శనం కల్పించారు. రాత్రి జ్వాలా ఉత్సవాన్ని, మహా మంగళహారతి ఇచ్చారు. సేవా సమితి జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సందీప్, రామ్‌మోహన్, కృష్ణారెడ్డి, సూర్యనారాయణ, సాయిబాబా, డాక్టర్ పార్వతి, గీత, మాలతి, సరోజ తదితరులు భక్తులకు సేవలు అందించారు.



కర్నూలు: భజనలు చేస్తున్న సత్యసాయి భక్తులు



ఓర్వకల్లులో పూలమాల వేస్తున్న జడ్పీ సీఈవో

ఓర్వకల్లు: ఎంపీడీవో కార్యాలయంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో నాగ అనసూయ, ఎంఈవో ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీగా వెళ్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగియి. ఎన్‌సీసీ విద్యార్థులు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బాలస్వామి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్‌సీసీలో ఉంటే క్రమశిక్షణ, దేశభక్తిని అలవర్చుకోవచ్చు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు లెఫ్టినెంట్ గోవిందు లెఫ్టినెంట్ ఈరమ్మ పాల్గొన్నారు.

'అవోపా' ఆధ్వర్యంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆదోని టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఆవోపా, వామ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. డా.అనిల్, డా సాయి తేజ, డా సురేంద్ర (ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్, హైదరాబాదు), డా సురేష్ (శాంతిరాం, హాస్పిటల్, నంద్యాల), ఎన్‌టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) కు చెందిన వైద్య బృందం 336 మందికి రక్తనాళాల పరీక్షలతోపాటు కంటి పరీక్షలను కూడా నిర్వహించారు. అవసరమైన వారికి రూ. 4500 ఖరీదు చేసే కలర్ డాప్లర్, టూడీ ఎకో, రక్తనాళాల పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. తీసుకోవలసిన జాగ్రత్తలను రోగులకు వివరించారు. అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి నాయకంటి రఘు, ఉపాధ్యక్షుడు ప్రతాప్ తీరన్న శెట్టి, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు రత్నయ్య, రాధాకృష్ణ, మాకం శ్రీధర్, ఆంజనేయులు, నవత వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, పరుచూరి రఘు, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, నాయకంటి శ్రీదేవి సభ్యులు మైత్రేయి, మణి, అనిత సంతోషి ప్రసన్న పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి మృతి



అరుణ్ (ఫైల్)

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీ కార్మికుడు అరుణ్ (35) ఆదివారం మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న అరుణ్ కోలుకోలేక మృతి చెందాడు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అరుణ్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాముకాటుతో గొర్రెల కాపరి..

ఆదోని రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నరసయ్య మృత్యువాత పడ్డాడు. ఈనెల 21వ తేదిన మాధవరం రహదారిలో ఉన్న రైతు హనుమంతు పొలంలో గొర్రెలు మేపుతుండగా పాముకాటుకు గురయ్యాడు. అతనితోపాటు వెళ్లిన కొడుకు సురేష్ తన తండ్రి పాముకాటుకు గురయ్యాడని తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం తండ్రి నరసయ్యను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు పెద్దతుంబళం ఎస్.ఐ మల్లికార్జున తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేలిన రిఫ్రిజిరేటర్



అట్టేకల్‌లో కాలిపోయిన సామగ్రి

ఆస్పరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రిఫ్రిజిరేటర్ పేలి రూ.15 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండలంలోని అట్టేకల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అట్టేకల్ గ్రామానికి చెందిన కారంజి వికాస్ అనే వ్యక్తి ఇంట్లో ఫ్రిజ్ పేలడంతో ఇంట్లో ఉన్న 9 తులాల బంగారం, రూ.2 లక్షలు నగదు, రూ.3 లక్షలు వంట సామగ్రి పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆర్థికంగా నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పునరావాసం కోసం సాయం చేయాలని బాధితుడు కోరాడు.

'హంప'లో 10 అడుగుల పాము



పది అడుగుల పామును చూపుతున్న షేక్షావలి

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హంపా గ్రామంలో షేక్షావలి అనే రైతు పొలంలో దాదాపు పది అడుగులకు పైగా ఉన్న పామును చూసి ప్రజలు అవాక్కయ్యారు. రోజు మాదిరిగానే ఆదివారం షేక్షావలి తన వ్యవసాయ తోటకు వెళ్లాడు. పొలం గట్టున ఉన్న పెద్ద పామును చూసి భయభ్రాం తులకు గురై పక్క పొలాల వారి రైతుల సాయంతో ఆ పామును చంపాడు. అయితే.. ఎన్నడూ ఇంత పెద్ద పాము చూడలేదని తెలిపాడు. పది అడుగుల పైగా పాము చూసేందుకు ఆ ప్రాంత రైతులు ఆసక్తి చూపారు.

కన్నుల పండువగా

సత్యసాయి శతజయంతి



సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ కొండయ్య

ఆదోని/ ఆదోని టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంగాభవాని ఆలయంలో సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ కొండయ్యతోపాటు ఇతర అధికారులు సాయిబాబా చిత్ర పటానికి పూలమాలలు వేశారు. బాబా అనేక రాష్ట్ర ప్రజల కోసం చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకొన్నారు. కార్యక్రమాలలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు శ్రీనివాస మూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ బాబు, మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నాసిర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : పుట్టపర్తి సత్యసాయిబాబ మానవ రూపాన మాధవుడని ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్ బాబు, డోన్ డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, హాలహర్వి డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఆదివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి మహోత్సవాల్లోభాగంగా, కార్యాలయాల్లో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వీరభద్రస్వామి, పంచాయతీ కార్యదర్శులు సురేష్, మల్లికార్జున, మంజు, షేక్, వీఆర్వోలు రాజశేఖర్ గౌడ్, ఈరన్న, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో, శ్రీ విద్యాసాయి కళాశాలలో పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రముఖ విరాళా దాత పారా రామచంద్ర ప్రసాద్, ఆర్ఐ రామదాసు, ఏపీవో నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేశారు. వీఆర్వో రంగస్వామి, శ్రీవిద్యాసాయి కళాశాల ప్రిన్సిపల్ బాలసునీత, టీడీపీ నాయకులు మెడికల్ తిమ్మప్ప, నరేంద్ర, దేవాలయ చైర్మన్ పారా రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: కరుణామయుడు, శాంత స్వరూపుడు శ్రీ పుట్టపర్తి సాయిబాబా శతజయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో మండల స్పెషల్ అధికారి సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో విశ్వమోహన్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అలాగే సిబ్బందికి, భక్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో మాలతి, ఏపీవో హేమసుందర్, జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, వీఆర్వోలు నవీన్ పాటిల్, నాగేంద్ర ఉన్నారు.

దేవనకొండ : పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుక స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. శాంతి, సేవ, సద్గుణం ప్రబోధాలను వివరించిన మహనీయుడు సత్యసాయి చిత్రపటానికి ఎంపీడీవో జ్యోతి పూలమాల వేశారు. జూనియర్ అసిస్టెంట్ హరికిరణ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ఆధ్యాత్మికతను పెంపొందించి ప్రజలను సన్మార్గంలో నడిపించిన పుట్టపర్తి సత్యసాయిబాబా సూచించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని తహసీల్దార్ ఎజాజ్‌అహమ్మద్, ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు న్యాయం

తుగ్గలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే యువతకు న్యాయం జరుగుతుందని రైతు సంఘం అధ్యక్షులు బాలన్న, టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, విద్యాకమిటి చైర్మన్ మిద్దె రవి అన్నారు. జొన్నగిరిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి రహదారులు గుంతలు పడి ఇబ్బందులు పడుతుంటే.. గత ప్రభుత్వం పట్టించుకోకపోతే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రహదారుల మరమ్మతుల కోసం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేయించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని జయశాలి రాష్ట్రస్థాయి అండర్17 అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంపికైన క్రీడాకారిణిని అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి గుర్తింపు తీసుకొచ్చి క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కంబి రెడ్డి అధ్యాపకులు యుగంధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పరిమళా పాల్గొన్నారు.

27న 'ఆణిముత్యాలు' నాటక ప్రదర్శన

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 27వ తేదీన ఆణిముత్యాలు అనే గొప్ప ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందని ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్ ఆదివారం తెలిపారు. 27న ప్రధానబస్టాండు వద్దగల రెడ్డిబాయి శివాలయం వద్ద ఆణిముత్యాలు పౌరాణిక నాటకంలో భాగంగా శ్రీకృష్ణ తులాభారం, పాన్పు శ్రీను, దైవపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం నాటకాలు ఉంటాయనీ తెలిపారు.

అందరికీ పనులు కల్పిస్తాం



మాట్లాడుతున్న ఏపీవో చక్రవర్తి

హాలహర్వి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వలసలు వెళ్లకుండా గ్రామాల్లోని ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పిస్తామని ఏపీఓ చక్రవర్తి అన్నారు. ఆదివారం బాపురం గ్రామంలో పనులపై గ్రామసభ నిర్వహించారు. ప్రతి గ్రామంలో కూలీలకు ఈ వారం నుంచి పనులు చూపిస్తామని, ప్రతిఒక్కరూ జాబ్‌కార్డులో పూర్తిస్థాయిలో వంద రోజులు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే మూడు వారాల వేతనాలు ఖాతాలో జమ అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ పుల్లయ్య, ఈసీ దాసు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1998-1999 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 26 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడంతో తోటి స్నేహితులను చూసి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు తెలుసుకుంటూ నాడు తరగతి గదిలో వారు చేసిన అల్లర్లును జ్ఞాపకం చేసుకున్నారు. ఆయా ప్రాంతాలలో ఉద్యోగాలలో, వృత్తులలో స్థిరపడి ఒకే చోట కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ ప్రవీణ్ రెడ్డి, నాటి గురువులు ఎలికే చిన్నప్ప, కేశవయ్య, మారెన్న, సిస్టర్ రేణుక లకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మరళీ కృష్ణ, లక్ష్మీనారాయణ, దాదాపీర్, శివబుల్ రెడ్డి, రాజా, ఉచ్చిరప్ప, రజాక్ వలి, శేక్షావలి పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి



మాట్లాడుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జేఏసీ స్టేట్ కో కన్వీనర్

ఆలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో ఉన్న సంబంధించి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరుతూ సోమవారం కర్నూలులో తలపెట్టిన సమగ్రశిక్ష ఉద్యోగుల పోరాట దీక్షకు జిల్లాలోని సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న పాఠశాలలు, మోడల్ హాస్టల్స్, భవిత, ఎంఆర్‌సీ కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ జేఏసీ స్టేట్ కో కన్వీనర్ మహమ్మద్‌రఫీ పిలుపునిచ్చారు.

కృష్ణయ్యను కలిసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



కృష్ణయ్యను కలిసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను ఎమ్మెల్యే కేఈ శాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆదివారం హైదరాబాద్‌లో కృష్ణయ్య స్వగృహంలో కలిసిన ఎమ్మెల్యే కేయి బీసీ సమస్యలు, రిజర్వేషన్ల అంశాలపై చట్టసభల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఆయనతో పాటు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వర రావు యాదవ్, ట్రైబల్ వెల్ఫేర్ అడ్వజరీ కమిటి సభ్యులు వెంకటపతి, తెలుగు రైతుసంఘం రాష్ట్ర నాయకులు నరసింహ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్‌లు ఉన్నారు.

తిమ్మప్ప స్వామికి ప్రత్యేక పూజలు

ఆదోని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంలంలోని బల్లేకల్ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధగాంచిన తిమ్మప్పస్వామి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కుబడులు తీర్చుకోవడానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. తిమ్మప్పస్వామి వారిని దర్శించుకున్న భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. తమ కోరికలు తీరినందుకు స్వామివారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ భక్తులు సంతృప్తిగా మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బల్లేకల్ తిమ్మప్పస్వామి ఆలయం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 4,5 తేదీలలో ఆలూరు మండల కేంద్రంలో జరిగే ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై జిల్లా మహాసభలో చర్చిస్తామని జిల్లాలోని ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు అంతా చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, శశిధర్, జగన్, నరసింహారెడ్డి, విజయ్, రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్న మీకోసం'

దేవనకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు రోజుల పాటు 'రైతన్న మీకోసం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో ఉషారాణి తెలిపారు. నేటి నుంచి వచ్చే నెల 3 వరకు కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు. రైతు కుటుంబాలకు ప్రభుత్వం తీసుకుంటున్న నూతన విధానాలు వివరించి, వారి సమస్యలను తెలుసుకొని, వచ్చే ఖరీఫ్, రబీ సీజన్లో తీసుకొవాల్సిన ప్రణాళికలు రూపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇంటింటికి కార్యక్రమంలో గ్రామీణాప్రాంతాలలోని వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాలలో రోజుకు 90 ఇళ్లు పర్యటించడం జరుగుతుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఆక్రమణల అడ్డంకి

- ఇరువైపులా అడ్డంకిగా మారిన బంకులు
- తొలగిస్తేనే రోడ్డు వేస్తామంటున్న కాంట్రాక్టర్లు
- తొలగింపునకు చర్యలు చేపట్టని అధికారులు



రోడ్డు నిర్మాణం కోసం కొలతలు వేస్తున్న అధికారులు

ఆలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలూరు-హొలగుంద రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. వర్షం కురిసినపుడల్లా రోడ్లపైకి నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేసింది. దీంతో అధికారులు పనులు కూడా ఆరంభించారు. అయితే ఆలూరు పట్టణంలో పంచాయతీరాజ్ కార్యాలయం మొదలుకొని మార్కెట్‌యార్డు వరకు ఇష్టానుసారంగా రోడ్డుకు ఇరువైపులా బంకులు వేసుకుని ఆక్రమించుకున్నారు. దీంతో భారీ వాహనాలు వస్తే ఆ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు అదే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినప్పటికీ పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా మారింది. వర్షం వచ్చిందంటే ఆ మార్గం మొత్తం వర్షం నీరు నిల్వ ఉండి బురదమయంగా మారడంతో ప్రజలు, విద్యార్థులు ఆ మార్గం ద్వారా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం అధికారులు కొలతలు వేసినప్పటికీ బంకులు తొలగించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంట్రాక్టర్లు రోడ్డు వేసేందుకు ముందుకు రావడం లేదు. బంకులు వేసుకోవడమే కాకుండా మెట్లు కట్టుకోవడంతో రోడ్డు కుంచించకుపోయింది. రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే ఇరువైపులా ఉన్న బంకులను తొలగించి రోడ్డు వేయాలని నాబార్డు అధికారులు, కాంట్రాక్టర్ భావించినప్పటికీ పంచాయతీ, ఆర్‌అండ్‌బి అధికారులు బంకుల తొలగింపుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోడ్డు నిర్మాణం పనులు మొదలుపెట్టేందుకు కాంట్రాక్టర్ సాహసించడం లేదు. మరోవైపు బంకుల ముందు ఉన్న మెట్లు తొలగించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. అలాగే రోడ్డు నిర్మాణం చేపడితే డ్రైనేజీలు ఎక్కడ నిర్మించాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న బంకులను తొలగించి సంత మార్కెట్‌లోకి తరలించకుండా రోడ్డు నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్య మరింతతీవ్రం అయ్యే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


సంబంధిత అధికారులు చొరవ చూపాలి-రోడ్డు నిర్మాణానికై ఇప్పటికే కొలతలు వేశాం. బంకులు తొలగిస్తే రోడ్డు వేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. పంచాయతీ, ఆర్‌అండ్‌బి అధికారులు సహకరిస్తే రోడ్డు నిర్మాణం పనులు ఆరంభిస్తాం.

● భాస్కర్, పీఐయూ ప్రాజెక్టు డీఈఈ, ఆలూరు

సద్వినియోగం చేసుకోవాలి

పత్తికొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మలు ప్రజలకు సూచించారు. ఆదివారం స్థానిక సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో విశ్వభారతి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి మెగా వైద్యశిబిరాన్ని రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్యశిబిరానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి సుమారు 60 మంది తరలివచ్చారు. కంటి జబ్బులున్న వారందరికీ కంటి వైద్యులు సురేష్‌బాబు పరీక్షలు నిర్వహించి, సోమవారం 40 మందికి పైగా ఉచితంగా కంటి ఆపరేషన్‌లకు కర్నూలుకు రెఫర్ చేశారు.

పేరు గొప్ప.. కార్యాలయం దిబ్బ



కార్యాలయం ఎదుట పరిస్థితి



కార్యాలయానికి వెళ్లే దారి

ఆదోని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 44 గ్రామాలు, 42 వార్డులు లక్షల మంది జనం.. పేరు గొప్ప కార్యాలయం దిబ్బ. ఎ అన్నచందంగా తయారయ్యింది ఆఉన్న ఇంత పెద్ద ఆదోని హౌసింగ్ కార్యాలయం.. ఈ స్థాయిలో అపరిశుభ్రంగా, అస్త వ్యస్తంగా ఉంటే తమ హౌసింగ్ సమస్యలు, పథకాల అమలు పరిస్థితి ఎలా ఉంటుందని స్థానిక ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది మందికి గృహ నిర్మాణ పథకాలను అందించే కీలక కార్యాలయమే ఇలా నిర్లక్ష్యానికి గురికావడంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కార్యాలయాన్ని శుభ్రం చేయించి సిబ్బంది పనితీరు మెరుగు పరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు బీపీఎస్ ద్వారా సరిచేసుకోండి

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) ద్వారా సరిచేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీపీఓ రాజేష్‌లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ భవనాలను యజమానులు బీపీఎస్ పథకం ద్వారా సరిదిద్దుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని భవనయజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలో సచివాలయాల వారిగా 250కి పైగా అక్రమ భవనాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆగస్టు 31కి ముందు నిర్మించిన అక్రమ నిర్మాణాలకు క్రమబద్ధీకరించుకోవటానికి మంచి అవకాశమన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీం సైతం వచ్చే ఏడాది జనవరి 23వరకు ప్రభుత్వం పొడగించిందన్నారు. ఎల్ఆర్ఎస్ కింద ఇప్పటివరకు 709 దరఖాస్తులు వచ్చాయన్నారు. మున్సిపాలిటికి రూ. 2.24కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. బీపీఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

సాగరతీరం పుస్తకావిష్కరణ



సాగరతీరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక సమన్వయ సంస్థ సభ్యులు

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నందవరం మండలం నాగలదిన్నె జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న గద్వాల సోమన్న రచించిన సాగర తీరం పుస్తకాన్ని హైదరాబాద్‌లో సాహితివేత్తలు ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఉన్న శారదకల్చరల్ స్టూడియోలో సంఘీత, సాహిత్య, సాంస్కృతిక సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో సాహితి వేత్త డా ఓలేటి పార్వతీశం, తెలంగాణ రచయిత సంఘం అధ్యక్షులు డా నాళేశ్వరం శంకరం, ఆధ్యాత్మిక రచయిత డా దుర్గాప్రసాద్, కళాపోషకులు ఏ ఎల్ కృష్ణారెడ్డి, డా రాజగోపాల్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కవి గద్వాల సోమన్న అత్యల్పకాలంలోనే 82 పుస్తకాలు రచించి, ముద్రించి ఆవిష్కరించటం అభినందనీయమన్నారు. అనంతరం సోమన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కవులు, కళాపోషకులు సాహిత్యప్రముఖులు, గాయకులు డా శరత్‌చంద్ర, అరవా రవీంద్ర బాబు, శివ, రమ్య, రాధాకుమారిలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి బాబా శతజయంతి



మంత్రాలయంలో సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులు

మంత్రాలయం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మంత్రాలయం ఎంపీడీవో కార్యాలయంలో డీపీవో భాస్కర్, ఎంపీడీవో, నూర్జహాన్, తహసీల్దారు రమాదేవిల ఆధ్వర్యంలో సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రాష్ట్రప్రభుత్వం సాయిబాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం శుభసూచకం అని డీపీవో భాస్కర్ అన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ అధికారి రాజు, డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయులు, ఆర్ఐ జనార్ధన్‌రావు, గ్రామ కార్యదర్శులు ఉపేంద్రరెడ్డి, వేణుగోపాల్, స్వామినాథన్, ఇస్రత్‌బాషా, దశరథ్, రామకృష్ణ, వీఆర్‌వోలు ఆనందు, ప్రభాకర్, భీముడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రేమ, ఆప్యాయత, మానవత్వకు మరో రూపమే సత్యసాయి బాబా అని గోనెగండ్ల తహసీల్దార్ రాజేశ్వరి అన్నారు. ఆదివారం గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయం నందు తహసీల్దార్ సిబ్బంది సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

బైలుప్పలలో నీటి క్యాన్లు పంపిణీ



ఉచితంగా నీటి క్యాన్లను అందజేస్తున్న టీడీపీ నాయకుడు డాక్టర్ మాచాని సోమనాథ్

గోనెగండ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయడంమే మచాని మెమోరియల్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచాని మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్. మాచాని సోమనాథ్ అన్నారు. ఆదివారం బైలుప్పల గ్రామంలో ప్రజల ఇంటింటికి ఉచితగా నీటి క్యాన్ మాచాని సోమనాథ్ అందజేశారు. గ్రామంలో 500 క్యాన్‌లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గోనెగండ్లలో తెల్లవారు జామున్న మంచు కురుస్తున్న దృశ్యం



మంచు తెర భద్రం జర

మంచు కురిసే వేళలో.. ప్రయాణం ప్రమాదమే..
- ప్రతి కూల వాతావరణంతోనే ఇబ్బందులు
- డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

గోనెగండ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):

చలి పులి పంజా విసిరింది. ఎముకలను కొరికేస్తుంది. జిల్లాలో గంటకు అయిదు నుంచి పది కిలోమీటర్ల వేగంతో చలి గాలులు వీస్తున్నాయి. కొన్ని రోజులుగా తెల్లవారుజామున, ఉదయం, సాయంత్రం, గతంలో ఎన్నడూ లేనంతగా పొగమంచు(ముసురు) కమ్ముకొవడంతో వాహనదారులను భయపెడుతుంది. ముందు వచ్చే వాహనం వెళ్లేవాహనాలు సరిగా కనిపించడం లేదు. గత ఏడాది ఈ మంచు కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక పోవడతో గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్‌రోడ్డు దగ్గర ఉదయం రోడ్డు క్రాస్ చేస్తూ ఓ బైకర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మరో నాలుగు రోజులకు రాత్రి గాజులదిన్నె దగ్గర ముసురు కారణంగా ముందు వెలుతున్న కారును వెనక వస్తున్న కారు ఢీ కొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వేముగోడు దగ్గర ద్విచక్రవాహనం నుంచి కింద పడి గౌస్ అనేవ్యక్తి మృతి చెందాడు. ఇలాంటి సంఘటన జరుగుతూనే ఉన్నాయి. తెల్లవారుజామున ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, కర్నూలు పరిసరాల్లో మంచు కురుస్తోంది. ఇటీవల బస్సులు, కార్ల ప్రమాదాల్లో చాలా మంది మృత్యువాత పడ్డారు.


ఈ ఏడాది నవంబరు నెల నుంచే ముసురు

డిసెంబరులో కురవాల్సిన మంచు ఈ ఏడాది నవంబరు నెలలోనే మంచు కురియడం ప్రారంభమైంది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురియడంతో గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం కారణంగా ముందుగాను మంచు కురియడం ప్రారంభమైనట్లు తెలుస్తుంది.

- సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసే వాహనాలు కొన్ని ఉంటాయి. వారు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ట్రక్కులు, లారీ డ్రైవర్‌లు విభిన్న వాతావరణాలను చవి చూడాల్సి ఉంటుంది. ఆ పరిస్థితుల్లో ప్రయాణం సాగించాల్సి వస్తుంది. పొగమంచు అధికంగా ఉన్న చోట్ల వాహనాలు అదుపు తప్పాల్సి వస్తుంది.
- వాహనాల కండీషన్ కుడా సరిచూసుకోవాల్సి వసుంది. లేక పోతే ప్రమాదాలు జరి గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మంచు కారణంగా కనిపించ పోవడంతో మర్జిన్ లో నిలిచిన వాహనాలను ఢీ కొట్టే ప్రమాదం లేక పోలేదు.

అర్ధరాత్రి ప్రయాణాలు మానుకోవడం మంచిది

అర్ధరాత్రి దాటిన తరువాత కాని ఉదయం ఆరున్నర లోపు చేసే ప్రయాణాలు వాయిదా వేసుకోవడం ఎంతో ఉత్తమం. రోడ్డు రవాణా శాఖ అధికారులు కూడా ఈ సమయంలో ప్రయాణంలో వద్దని చెబుతారు. ఈ సమయంలో డ్రైవర్‌లకు నిద్ర ఎంతో అవసరం, తప్పని సరి పరిస్థితులు ఉంటే నియమ నిబంధనలు పాటిస్తు ప్రయాణం సాగించాలి.



సుదీర్ఘ అనుభవం ఉన్నవారే డ్రైవింగ్ చేయాలి

తప్పనిసరి పరిస్థితులలో ప్రయాణం ఉంటే సుదీర్ఘఅనుభం ఉన్న డ్రైవర్ తప్పని సరిగా ఉండాలి. ద్విచక్ర వాహనదారులు పార్కింగ్ లైట్ వేసుకోవాలి. 50 నుంచి 60 మీటర్ల దూరం ఉండగానే బ్రేక్ వేసుకోవాలి. రహదారి మార్జిన్ లో వాహనాలు ఆగిపోతే సంకేతం ఇచ్చేలా రేడియం స్టిక్కర్‌లను ఉపయోగించుకోవాలి. అద్దలను మెత్తటి బట్టతో ఎప్పటి కప్పుడు తుడుచుకోవాలి.

- 10లోపు మీటర్లు వరకు మాత్రమే రోడ్డు కనిపిస్తే బ్లింకర్లును ఆన్‌చేసి రోడ్డు మార్జిన్ మార్కు దాటించి వాహనాన్ని నిలిపివేయడం మంచిది.
- 15 మీటర్లు వరకు మాత్రమే రోడ్డు కనిపిస్తే స్పీడ్ తగ్గించి 30 నుంచి 35 కిమీ స్పీడ్‌లో వెళ్లడం మంచిది.
- 15 మీటర్ల పై బడిఉంటే స్పీడు 40 కిమీలకు మించరాదు.

అధికారుల చర్యలు ఇలా..

- వాహన డ్రైవర్లు అర్ధరాత్రి దాటిన తరువాత ఏదో ఒక ప్రదేశంలో నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలి.
- డ్రైవర్ రెండు గంటలకు ఒకసారైన టీ తాగేందుకు అవకాశం ఇవ్వాలి.
- రాత్రి పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులు వాహనాల డ్రైవర్‌లకు రాత్రిపూట ముఖం కడిగించి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- పెట్రోలింగ్ తిరిగే పోలీసులు వాహనాలను తనిఖీలు చేయాలి. గస్తీ వాహనాలు పెద్ద శబ్దం చేస్తు ఉండాలి.



రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మాధవరంలో ఆయన నివాసంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ హిట్‌కావడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం నుంచి 30 వరకు మంత్రాలయం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అంజేస్తామని అన్నారు. సోమవారం మంత్రాలంయం మండలం లోని రచ్చుమర్రి గ్రామంలో వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, మండలంలోని వివిధ శాఖల అధికారులతో కలిసి అన్నదాతల ఇంటికి వెళ్లి వారికి భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా మండల అధ్యక్షులు, ఎల్ఎల్‌సీ చైర్మెన్, మార్కెట్ యార్డు చైర్మెన్, నీటిసంఘాల అధ్యక్షులు, సొసైటీ చైర్మెన్‌లు, డైరెక్టర్లు, గ్రామ అధ్యక్షులు, క్లస్టర్, బూతు ఇంచార్జీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు, మంచాల సింగిల్‌విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాజారెడ్డి, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: ఈనెల 24నుంచి డిసెంబర్ 3వ తేదివరకు రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఏడు రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వీఏఏలు, ఈఎస్ఏ, ఆర్ఎస్‌కేలు కలిసి రైతుల ఇళ్లదగ్గరకు వెళ్లి 2024-25 రబీ,ఖరీఫ్ పంటలపై రైతుల అనుభవాలను సేకరించటం జరుగుతుందన్నారు. ఏపీ ఎఐఎంఎస్ యాప్‌ను రైతులకు పరిచయం చేసి రోజు వారి డేటాను షెడ్యూల్ ప్రకారం యాప్‌లో సిబ్బంది పొందుపరచటం జరుగుతుందన్నారు. 24 నుంచి 29వ వరకు ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రత్యక్ష పరామర్శ నవంబర్ 30నుంచి డిసెంబర్ 3వరకు రైతుల ఇళ్ల నుంచి సేకరించిన డేటాను నమోదు చేసి విశ్లేసించటం జరుగుతుందన్నారు.

కోసిగి: సోమవారం నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. ఆదివారం కోసిగిలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయం, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోనెగండ్ల: రైతన్న కోసం వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కు మర్గం చూపేందుకు గాను అలాగే సీఎం చంద్రబాబునాయుడు రైతులకు ఇచ్చిన ఐదు సూత్రాలను వివరించేందుకు గాను సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఏడు రోజులు జరిగే ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాన యూనిట్‌గా తీసుకొని 24 నుంచి 29 వరకు రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రత్యక్ష పరామర్శ చేపట్టాలన్నారు. అలాగే నవంబరు 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు రైతులు ఇళ్ల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించడం జరుగుతుందన్నారు. చివరి రోజుల రైతు సేవా కేంద్ర దగ్గర వర్క్‌షాప్ నిర్వహించి రబీ 2025-26, ఖరీఫ్ 2026-27కు సంబందించిన యాక్షన్ ప్లాన్‌ను తుది రూపం ఇవ్వడం జరుగుతుందన్నారు.

రాఘవేంద్రస్వామికి బంగారు గొలుసు బహూకరణ



మేనేజర్‌కు బంగారు గొలుసును విరాళంగా ఇస్తున్న దాతలు

మంత్రాలయం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంరాఘవేంద్ర స్వామికి విజయవాడకు చెందిన న్యాయవాది దుర్గంపూడి వేణుగోపాల్‌రెడ్డి, సుధారాణి అనే దంపతులు 8 గ్రాములతో తయారు చేయించిన బంగారు గొలుసును బహూకరించారని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్‌కోణాపూర్ తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని బంగారు గొలుసును మేనేజర్ వెంకటేష్ జోషికి అందచేశారు. కార్యక్రమంలో శ్రీపాదఆచార్, నరసింహదేశాయ్, వడ్డెనారాయణలు పాల్గొన్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల పల్లకోత్సవం



చెక్క పల్లకిలో ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రహ్లాదరాయల పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి రాఘవేంద్రస్వామి మఠంలో తదియ శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదరాయలకు పాద పూజ చేసి పల్లకిలో అధిష్టించి వివిధ రథాలపై రమణీయంగా ఊరేగించారు.

- తమిళనాడులోని వెళ్లూర్ శ్రీవ్యాసరాజ మఠం పూర్వపు పీఠాధిపతులైన కంబళూర్ రామచంద్ర తీర్థుల మధ్యరాధన మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. రామచంద్ర తీర్థుల బృందావనానికి వ్యాసరాజ మఠం పీఠాధిపతులతో పాటు మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి



కళ్లకు గంతలు కట్టుకొని నిరాహార దీక్షల్లో పాల్గొన్న కార్మికుల కుటుంబ సభ్యులు, నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటిలో పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన పారిశుధ్య కార్మికులు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ, ఆటో వర్కర్స్ యునియన్ నాయకులు రాముడు, బాలు, దూద్ పీరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం దగ్గర నిరాహర దీక్షలు చేస్తున్న కార్మికులకు సీఐటీయూ, ఆటోవర్కర్స్ యునియన్ నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ గతంలో మున్సిపాలిటీలో కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాల్లో వారికి ఉద్యోగాలు ఇచ్చేవారన్నారు. గత ప్రభుత్వంలో ఆప్కాస్ ద్వారా కార్మికుల కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. 2024 ఆగస్టులో స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి కార్మికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారన్నారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీఐటీయు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిమ్మగురుడు, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, ఆటో యునియన్ నాయకులు రంజాన్, రాజులు పాల్గొన్నారు.

- **కళ్లకు గంతలుకట్టుకొని నిరాహార దీక్షలు:** మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయం దగ్గర కార్మికులు, కుటుంబాల చేస్తున్న దీక్షలు ఆదివారాన్ని ఏడో రోజుకు చేరుకున్నాయి. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. నాయకులు తిమ్మగురుడు, ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు బతికున్నప్పుడు శ్రమదోపిడికి పాల్పడి, చనిపోయిన తరువాత వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తారా అంటు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు విజేంద్ర, భీమన్న గౌడ్, కిరణ్, అశోక్, రాములు పాల్గొన్నారు.

గుడికల్‌లో ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన



గ్రామ సచివాలయంలో ప్రజలు, అధికారులతో సమావేశమైన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్ గ్రామంలో ట్రైనీ ఐపీఎస్ సుబంగి సుదర్శన్ కేకన్, ఐఆర్ఎస్ నిధి గోయల్, టీడీఎస్ ఎండీ బుర్హన్ జమాన్, ఐఎఫ్ఎస్ అశితోష్ గుప్త, ఐఆర్ఎస్ రాంశంకర్ మీనా ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ శాఖద్వారా రైతులకు అందుతున్న సంక్షేమ పథకాలు వాటి నిబంధనలు, పంటల సాగుకు సంబందించిన వివరాలు అధికాలద్వారా తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి పథకాల అమలు గురించి వాటి పనితీరు తెలుసుకున్నారు. ట్రైనీ అధికారులు ఐదురోజుల పాటు గ్రామంలో పర్యటించి వివిద శాఖల గురించి తెలుసుకోనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో బంగారమ్మ, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏవో శివశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన యువకుడు ఆనంద్

కోసిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో జుమాల్‌దిన్నె గ్రామ సమీపంలోని ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన ఉలిగ్ర ఆనంద్, నాగరాజు, రాకేష్ యువకులు దినసరి కూలీ కోసం రాయచూరుకు వెళ్లేవారు. అయితే వీరు పని ముగించుకొని స్వగ్రామమైన కామవరంకు బైక్‌పై వస్తుండగా ఉరుకుంద రోడ్డులోని జుమాలదిన్నె కల్వర్టు రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ముగ్గురిలో ఉలిగ్ర ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందగా.. తోవి నాగరాజు, రాకేష్‌కు గాయాలయ్యాయి. ఎస్ఐ రమేష్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పూజలందుకుంటున్న కోసిగయ్య స్వామి

వైభవంగా కోసిగయ్య స్వామికి పూజలు

కోసిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు కార్తీక మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు కోసిగయ్యస్వామి (ఆంజనేయస్వామి)కి కార్తీక మాస దీపోత్సవ ముగింపు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం దేవాలయం ముందు యువతీ యువకుల కోలాటాలు అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావు, గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.



భారీగా తరలివచ్చిన జనం